క్లుప్తంగా

మండల సమావేశం వాయిదా

చింతకొమ్మదిన్నె : మండల సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా వేసినట్లు, త్వరలో ప్రజాప్రతినిధులతో చర్చించి మరో తేదీలో సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ కుళ్లాయిబాబు తెలిపారు. ప్రజాప్రతినిధులలో కేవలం ముగ్గురు సర్పంచులు మాత్రమే మండల సమావేశానికి హాజరయ్యారు. ఒక్క ఎంపీటీసీ సభ్యులు కూడా హాజరు కాలేదు. ఎంపీటీసీ సభ్యులకు గౌరవేతనాలు చెల్లించకపోవడంతో తాము బాయ్‌కాట్ చేసినట్లు ఎంపీటీసీ సభ్యులు తెలిపారు.

పరామర్శ



ప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండల పరిధి నుంచి కడప నగరంలోకి విలీనమైన మామిళ్లపల్లె ప్రాంత 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ప్రసాద్ రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

పనికితగిన వేతనం ఇవ్వాలి



డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు, ప్రజా సంఘ నాయకులు

కొండాపురం : ఆశవర్కర్లకు పనికి తగ్గ కనీస వేతనం ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. మంగళవారం జిల్లా సమితి పిలుపుమేరకు కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ వర్కర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాక్టర్ సాంబశివారెడ్డికి ఆశ వర్కర్ల సమస్యలపై సీపీఐ, ఏఐటీయూసీ, ఆశ వర్కర్ యూనియన్లు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు టి.సుబ్బరావు, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామంలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. బుధవారం ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, అధికారులతో కలసి అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కోగటంతో పాటు చిన్నపురెడ్డిపల్లె, కంచన్నగారిపల్లె గ్రామాల్లో రూ.3కోట్లతో సీసీ రోడ్లు, షాదిఖాన, గ్రామ పంచాయతీ భవనం పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మండలస్థాయి క్రీడా పోటీలు

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 9,10 తేదీలలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం తెలిపారు. ఈనెల 9న అథ్లెటిక్స్ 10న వాలీబాల్, ఖోఖో, కబడి, యోగా, షటిల్, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఈ పోటీలో పాల్గొనే అవకాశం వున్నట్లు ఆయన తెలిపారు.

భగవద్గీత ప్రచారంలో ఇస్కాన్



పురవీధులలో సంకీర్తనలు చేస్తున్న ప్రవచకులు

పులివెందుల టౌన్ : ప్రొద్దుటూరు ఇస్కాన్ వారి సంకీర్తన రథంతో సనాతన ధర్మం, భగవద్గీత, భాగవతం గురించి వివరిస్తూ పులివెందుల పట్టణంలో మంగళవారం సంకీర్తన చేశారు. హరే రామ హరే కృష్ణ, కృష్ణ హరే హరే సంకీర్తనలతో భగవద్గీత పుస్తకాలను ప్రవచకులు పట్టుకుని పురవీధులలో తిరిగారు. ప్రత్యేక రథంతో పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, గాడిచర్ల వారి వీధి, గుంత బజార్, మెయిన్ బజార్ మీదుగా నగర సంకీర్తన చేశారు. మూడు రోజులపాటు పులివెందులలో నగర సంకీర్తన చేసి అనంతపురం జిల్లాకు వెళ్లనున్నట్లు వారు తెలిపారు.

గంగమ్మా.. చల్లగా చూడమ్మా

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని పెద్దదండ్లూరు గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన గంగమ్మకు మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా గ్రామ పెద్దల సహకారంతో గ్రామానికి చెందిన భక్తుడు అమ్మవారికి వెండి కళ్ళతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.

వరికి మద్దతు ధర కల్పించని ప్రభుత్వం

- గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతన్నలు
- క్వింటా వరి రూ.2369లు ఉండగా.. దళారులు రూ.1675లకు కొనుగోలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీలలో కల్పించిన మద్దతు ధర
- మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలని కోరుతున్న రైతులు

వేంపల్లె : దేశానికి వెన్నుముక లాంటి రైతన్నలు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పంటలకు గిట్టుబాటు ధరలేక అల్లాడిపోతున్నారు. ప్రభుత్వం వరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. వరికి మద్దతు ధర లేక రైతులు దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీలలో రెండు పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకున్నారు. జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయర్ అధికారులు స్పందించి వరి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 3వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. మండలంలోని అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె, కుమ్మరాంపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె, వేంపల్లె గ్రామాల్లో ప్రధాన పంట వరి పంట కావడంతో పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక అల్లాడిపోతున్నారు. ఎకరాకు రూ.30 వేలకుపైగా ఖర్చు చేసి వరి పంటను సాగు చేశారు. 300 ఎకరాలకుపైగా అల్పపీడనం వల్ల కురిసిన వర్షానికి వరి పంట నేల కొరిగింది. వరి రైతులకు కూటమి ప్రభుత్వం సక్రమంగా యూరియాను అందించకపోవడంతో బ్లాక్ మార్కెట్లలో యూరియాను కొనుగోలు చేయడంతో మరింత భారం పెరిగింది. దీనికి తోడు ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడంతో రైతులు దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. ప్రభు త్వం క్వింటా వరి ధాన్యానికి మద్దతు ధర రూ. 2369లు ఉండగా.. దళారులు రూ.1675లకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్, రబీలలో పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో రైతులు ఆనందంగా ఉండేవారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను అందించేవా రు. అంతేకాకుండా రైతులకు ఉచితంగా పంటల బీమా కూడా చెల్లించి పంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ మంజూరు చేసేవారు. కూట మి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.



వేంపల్లెలో సాగు చేసిన వరి పంట

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ప్రభుత్వం వరికి మద్దతు ధరను కల్పించి కొనుగోలు చేయాలి. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలకుపైగా ఖర్చు చేశాం. దీనికితోడు యూరియా బ్లాక్ మార్కెట్లలో కొనుగోలు చేయడంతో మరింత భారం పెరిగింది. దళారులు క్వింటా ధర రూ.1675లు ఇస్తుండటంతో నష్టపోతున్నాం. ఇలాగే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో వరి పంటను సాగు చేయలేం.

– రామకృష్ణారెడ్డి, వరి రైతు, అలిరెడ్డిపల్లె, వేంపల్లె

దళారుల చేతుల్లో నష్టపోతున్నాం



ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో దళారుల చేతుల్లో నష్టపోతున్నాం. ఇటీవల అల్పపీడనంవల్ల కురిసిన వర్షానికి దాదాపు 300 ఎకరాలలో వరి పంట నేలకొరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ రెండు పంటలకు మద్దతు ధర కల్పించారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు స్పందించి రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఆదుకోవాలి.

– శంకరయ్య, వరి రైతు, ఇడుపులపాయ, వేంపల్లె మండలం

ఘనంగా వాల్మీకి జయంతి

కొండాపురం : రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి శ్రీవాల్మీకి మహర్షి అని వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు వై.మునయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరులో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు.

15న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

ముద్దనూరు : ఈనెల 15వ తేదీన కడపలోని శ్రీరాజరాజేశ్వరి కల్యాణ మండపంలో మాదిగల ఆత్మీసమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐగా శివనాగిరెడ్డి

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్‌ఐగా ఆర్.శివనాగిరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌ఐ మా ట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిపెడతానన్నారు. ఏ సమస్య వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి

కమలాపురం : మహానేత వైఎస్సార్ 2004లో జీఓ నెంబర్ 429ను ఏర్పాటు చేసి గ్రామీణ వైద్యుల(ఆర్ఎంపీ, పీఎంపీ)కు ప్రభుత్వ వైద్యులతో శిక్షణ ఇప్పించి వారికి రక్షణగా నిలిచారని, ఈ ఘనత ఒక్క వైఎస్సార్‌కే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కొనియాడారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 5.3 కోట్ల మంది ఉంటే 9 వేల మంది మాత్రమే వైద్యులు ఉన్నారని వారితో పేద ప్రజలందరికి ఉచిత వైద్య సేవలు అందించడం సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో 12వేలకు పైగా ఉన్న గ్రామాల్లో ఆ ప్రాంత ప్రజలకు గ్రామీణ వైద్యులు కారు చౌకగా వైద్యం అందిస్తున్నందున వారే దిక్కుగా ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది క్వాలిఫైడ్ డాక్టర్లు ఉన్నప్పటికి వారంతా నగరాలు, పట్టణాలకే పరిమితం అవుతున్నారన్నారు. నాడు వైఎస్సార్ 25వేల మంది గ్రామీణ ప్రాంత వైద్యులకు శిక్షణనిప్పించారని, నేడు చంద్రబాబు సర్కార్ మిగిలిన వారందరికి శిక్షణనిప్పించి వారికి చట్టబద్ధత కల్పించాలన్నారు. నేడు కొందరు దళారులు, రాజకీయ వ్యభిచారులు గ్రామీణ వైద్యుల పనితీరును కించ పరచడం నీచం, దుర్మార్గం, పైశాచికం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎంపీల వద్ద వైద్య సేవలు పొందిన వారు ఇబ్బందులు కలిగి ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ ఎలాంటి సంబంధం లేని బ్రోకర్లు, లంచగొండులు ఫిర్యాదు చేసి ఆర్ఎంపీల వద్ద అందిన కాడికి దండుకుంటున్నారన్నారు. కొందరు ఆర్ఎంపీలు మీకు ఎందుకు డబ్బులు ఇవ్వాలని బ్రోకర్లను నిలదీస్తే వారు అక్రమ ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. అధికారులు కనీసం విచారణ కూడా చేయకుండానే గ్రామీణ ప్రాంత వైద్య శాలలను మూసి వేస్తున్నారన్నారు. ఎర్రగుంట్ల, చిలంకూరు, దువ్వూరు, గుడిపాడు, కడప లాంటి పలుచోట్ల ఇటీవల వైద్యాధికారులు ప్రథమ చికిత్స కేంద్రాలను మూసివేయడం తగదన్నారు. కూటమి సర్కారులో ఆర్ఎంపీల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు.

టమోటా పండ్లు నీటిపాలు



ఆటో గుంతలోకి దిగడంతో జారిపడ్డ టమోటా బాక్స్‌లు

మైలవరం : మండలంలోని పలు గ్రామాలు మోకాటిలోతు నీటితో నిండిపోతున్నాయి. గుంత లోతును పసికట్టలేని ఆటో వాలా మంగళవారం ఉదయం వద్దిరాల గ్రామంలో రోడ్డు అనుకుని రోడ్డులో ఆటోను దించాడు. అంతే గుంతలో పడిన ఆటో అందులో ఉన్న రెండు బాక్స్‌ల టమోటా పండ్లు నీటిలో పడ్డాయి. పొట్ట చేత పట్టుకుని కూరగాయాలు అమ్ముకోవటానికి వచ్చిన ఆ పేద మహిళ సదరు ప్రభుత్వానికి పొగుడుకుంటూ ఖాళీ బాక్స్‌లను చేతపట్టుకుని ఇంటికి తిరుగుముఖం పట్టింది. ఒక ఆటోనేకాదు.. నడిరోడ్డుపైన నిలబడ్డ ఆ నీటిలోనికి బండిని దించాలంటే ఏ వాహన చోదకుడైనా గుండెను అరచేతిలో పెట్టుకోవలసిందే. వద్దిరాల నాలుగు రోడ్ల కూడలి చెరువును తలపించే ఈ గుంతను అటు పాలకులు గాని, ఇటు ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకునే పాపనపోలేదు.

పథకాల అమలుకు చర్యలు తీసుకోండి

వేంపల్లె : రాష్ట్రంలో అనేక మంది బ్రాహ్మణులకు ఉపయోగపడే కష్యప గరుడ పథకాలు వెంటనే అమలు చేసేలా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పాలక మండలి చర్యలు చేపట్టాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీఎస్వీ ప్రసాదరావు, సూగురు రఘునాథరావులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గరుడ పథకం ఎంతోమంది పేద బ్రాహ్మణులకు ఉపయోగకారి అని గత నాలుగేళ్ల నుండి ఒక్కరికి ఈ పథకం ద్వారా ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదన్నారు. కనీసం 2024 జూన్ నెల నుండి అయిన పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలని కోరారు. పథకం కింద మంజూరు చేసే రూ.10 వేలు 2015వ సంవత్సరంలో నిర్ణయించారని, పస్తుత పరిస్థితిలో రూ.20వేలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది నుండి కార్పొరేషన్‌కు బాధ్యులు లేకపోవడంతో బ్రాహ్మణులు ఎవరిని అడగాలో తెలియక ఆందోళనతో ఉన్నారన్నారు. ప్రస్తుత పాలక మండలి ఏర్పాటు కావడంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. ఇటీవల నార్పల మండలంలో ఒక బ్రాహ్మణుడు, అతని కుటుంబ సభ్యులు చనిపోతే ఖర్చులకు డబ్బులు లేక బంధువులు సమాచారమివ్వకుండా అనంతపురంకు ఆటోలో తెచ్చి దహన సంస్కారాలు చేశాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చునన్నారు. బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కేటాయించిన మొత్తంలో తల్లికి వందనం పథకం డబ్బులు మినహాయించి మిగిలిన మొత్తం ప్రభుత్వం నుండి తెచ్చుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్పీ జోక్యం చేసుకుని చార్జ్‌షీట్ వేయించాలి

కమలాపురం : దువ్వూరు మండలం ఇడమడకకు చెందిన వైఎస్సార్ సీపీ నేత నగరి శ్రీకాంత్‌పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న కేసులో జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుని సీడీ ఫైల్ కోర్టుకు సమర్పించి చార్జ్‌షీట్ వేసేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపురం సబ్‌జైలులో ఉన్న శ్రీకాంత్‌ను ఆయన పరామర్శించి మాట్లాడారు. కేవలం వైఎస్సార్ సీపీ నేత అనే కారణంతో శ్రీకాంత్ దాబాను కూల్చి వేసి తిరిగి అతడి పైనే అక్రమ కేసు బనాయించి జైలుకు పంపించి బెయిల్ రాకుండా అడ్డుకోవడం టీడీపీ నాయకుల బరితెగింపునకు నిదర్శనమన్నారు. ఇలాగే వ్యవహరిస్తే టీడీపీ నాయకులు అభాసుపాలు కావడం ఖాయమన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ స్పందించి జోక్యం చేసుకుని శ్రీకాంత్‌కు సంబంధించిన సీడీ ఫైల్‌ను కోర్టుకు పంపించి చార్జ్‌షీట్ వేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

వేముల : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని చింతలజూటూరు గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసుల కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళా జాతలో గ్రామాల్లో ఫ్యాక్షన్ నిర్మూలన, సామాజిక మాధ్యమాల నేరాల గురించి, డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై కళాజాత రూపంలో ప్రజలకు వివరించారు. వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా శాంతియుత వాతావరణానికి సహకరించాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. ఎవరికి వారు పంతాలకు పోయి ఘర్షణలకు దిగవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తెలిపారు.



సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న హెచ్ఎం, తదితరులు

పులివెందుల రూరల్ : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెడ్మాస్టర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం నల్లపురెడ్డిపల్లెలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి కోసం వానరాల పాట్లు

పులివెందుల రూరల్ : పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీరంగనాథస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న వానరాలు కొళాయిని తిప్పాయి. కొళాయి నుంచి నీరు రావడంతో ఒకటి తర్వాత ఒకటి దప్పిక తీర్చుకున్నాయి. ఈ దృశ్యాలను సాక్షి రిపోర్టర్ తన కెమెరాలో బంధించారు.





స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

కమలాపురం : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున వెల్లడించారు.

మంగళవారం కమలాపురంలో పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ తరపున అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో జనగణనలో కులగనన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్, ఇతర నాయకలు పాల్గొన్నారు.

కాలుష్య నివారణపై చర్యలు తీసుకోండి

ఎర్రగుంట్ల : థర్మల్ పవర్ ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న ఫ్లైయాష్ బూడిద, కెమికల్ కాలుష్య ప్రభావం నుంచి కాపాడాలని కలమల్ల గ్రామస్తులు కోరారు. మంగళవారం ఆర్టీపీపీకి వచ్చిన ఏపీజెన్‌కో డైరెక్టర్ (థర్మల్) అశోక్‌రెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు.

కలమల్ల గ్రామం పరిధిలో ఉన్న వంక పూర్తిగా బూడిదతో నిండిపోయిందని, దాన్ని తొలగించి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలన్నారు. రవాణ శాఖ పరిమితి మేరకు ఆర్టీపీపీ యాజమాన్యం వారు బూడిద వాహనాలకు బూడిద నింపాలన్నారు. ఆర్టీపీపీలో 1535 యూనియన్ నేతలు కూడా ఏపీజెన్‌కో డైరెక్టర్ (థర్మల్)ను కలసి సమస్యలపై విన్నవించారు.



ఏపీజెన్‌కో డైరెక్టర్ (థర్మల్) అశోక్‌రెడ్డిని కలసి విన్నవిస్తున్న కలమల్ల గ్రామస్తులు

పోలీసుల తీరు గర్హనీయం

వేంపల్లె : బీవైసీ పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ పట్ల పోలీసుల తీరు గర్హనీయమని బీవైసీ పులివెందుల ఇన్‌చార్జి సురే నిర్మలయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆమె మాట్లాడుతూ రాజయ్యపేట రైతులకు మద్దతుగా వెళ్తున్న రామచంద్రయాదవ్‌ను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. రైతులకు మద్దతు ఇవ్వటం నేరమా అని ప్రశ్నించారు. డ్రగ్స్ కంపెనీకి కూటమి ప్రభుత్వం రైతుల భూములను కట్టబెట్టాలని ప్రయత్నం చేస్తుంటే రైతులు డ్రగ్స్ కంపెనీకి భూములు ఇవ్వమని చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వడానికి తమ అధినేత వెళ్లడం జరిగిందన్నారు. రైతులకు మద్దతు ఇవ్వడానికి వెళ్తున్న రామచంద్రయాదవ్‌ను పోలీసులు అడ్డగించి ఆపడం ఎంతవరకు సమంజసమన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చారు.. కనెక్షన్ మరిచారు

మైలవరం : మండలంలోని వద్దిరాల గ్రామానికి చెందిన వెంపలాకు పెద్దిరాజు అనే రైతు తన పొలంలో మొక్కజొన్న పంటను సాగుచేసుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో దాని స్థానంలో మరమ్మతు చేసిన మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇచ్చిన అధికారులు దానికి కనెక్షన్లు ఇవ్వడంలో మీన మేషాలు లెక్కిస్తున్నారు. త్వరగా విద్యుత్ సరఫరా ఇస్తే పొలానికి నీరు కట్టుకుంటానని సదరు రైతు అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్న స్పందన కరువైంది. కిందిస్థాయి సిబ్బందికి అంతో ఇంతో ముట్టజేప్పాడు కూడా .అయితే వారు ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారులు ఆలస్యం చేస్తే తన పంట ఎడిపోయే పరిస్థితి వస్తుంది. కాబట్టి వెంటనే అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని పెద్దిరాజు అధికారులను కోరుకుంటున్నాడు. ముఖ్యంగా ఇక్కడి సీనియర్ లైన్‌మెన్ రైతులకు అస్సలు పలకడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని రైతు కోతున్నాడు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వలేదని చెబుతున్న రైతు పెద్దిరాజు

25 వార్డులకు కౌన్సిల్ ఆమోదం

జమ్మలమడుగు : మున్సిపల్ వార్డులను 20 నుంచి 25 వార్డులుగా మార్చుతూ కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. ఇప్పటి వరకు 20 వార్డులుగా ఉన్న నగర పంచాయతీ రాబోయే ఎన్నికల్లో 25 వార్డుల్లో సభ్యులు పోటీ చేయబోతున్నారు. 1వ వార్డులో భాగ్యనగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నమాజ్‌కట్ట పూలతోట డోర్ నంబర్ 19/803 నుంచి ప్రారంభమై 19/1410తో ముగుస్తుంది. ఈ వార్డులో మొత్తం ఓటర్లు 1552. 2వ వార్డులో భాగ్యనగర్‌కాలనీ, ఎల్లారెడ్డితోట, లక్ష్మీవాటర్ ప్లాంట్ వీధుల్లో ఉన్న డోర్‌నంబర్ 19/1411 మొదలు 19/1856తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1433. 3వ వార్డులో సంజామలమోటు, ఎంపీడీఓ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ ముందు వెనుకవీధి నుంచి మూడురోడ్ల వరకు, సాయిరాం థియేటర్ వెనుక వైపు వరకు డోర్ నంబర్ 20/1-20/221 మొదలు 21/1 -21/292తో ముగుస్తుంది, ఈ వార్డులో మొత్తం ఓటర్లు 1463. 4వ వార్డులో వెటర్నరీ హాస్పిటల్ రోడ్డు, బాలాజీ స్కూల్ ముందు వీధి, కెకె వీధి, మోరగుడి సర్కిల్ నుంచి పెద్దపసుపల మోటు, తేరురోడ్డు, శ్రీరామ్‌నగర్, లక్ష్మీనగర్, మునిరెడ్డి కాలనీలలో ఉన్న డోర్ నంబర్ -21/293 మొదలు -21/800తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1429. 5వ వార్డులో లక్ష్మీనగర్, టీచర్స్‌కాలనీ, రామిరెడ్డిపల్లె రోడ్డు, చేకూరి రామయ్య కాలనీలలో ఉన్న డోర్ నంబర్ 21/801-21/1342 వరకు అదేవిధంగా -22/1-22/67 వరకు, మొత్తం ఓటర్లు 1608. 6వ వార్డులో నాగులకట్ట, అంబేడ్కర్ భవన్, చౌడేశ్వరి దేవాలయం, శివాలయ దేవాలయం వరకు డోర్ నెంబర్‌నుంచి -22/68 -22/500వరకు అలాగే, -23/1-23/92 మొత్తం ఓటర్లు 1650. 7వ వార్డులో నాగులకట్ట, సాయిబాబా ఆలయంలో ఉన్న డోర్ నంబర్ 23/93-23/561 ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1738. 8వ వార్డు గోమడుగువీధి, చిమ్మనివీధి, తాడిపత్రి రోడ్డు, సీఎస్‌ఐ కాంపౌండ్, ఎల్ఎంసీ కాంపౌండ్, ఎస్సీకాలనీ, శబరి కాలనీ, పాతబస్టాండ్ వరకు డోర్ నంబర్ 23/562-23/649వరకు అలాగే -24/01-24/498తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1740. 9వ వార్డులో బీసీ కాలనీ, ప్రొద్దుటూరు రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, ఈశ్వరయ్యవీధి, ఎంఎల్ నారాయణరెడ్డి వీధిల్లో ఉన్న డోర్‌నంబర్ 24/499- 24/1174 తో ముగుస్తుంది. మొత్తం ఓటర్లు 1493. 10వ వార్డులో ఈశ్వరయ్య వీధి, మేధారి కాలనీ, దుత్తలూరు, రోటరీ నగర్, రామిరెడ్డిపల్లె గాయత్రినగర్, ప్రొద్దుటూరు రోడ్డు శ్రీనివాసనగర్ డోర్ నంబర్ 24/1175 మొదలు -24/1475 వరకు, అలాగే -1/01-1/290, 25/01-25/110 లతో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1416. 11వ వార్డులో కన్నెలూరు, ఎస్సీకాలనీ, గోరిగేనూరు రోడ్డు, దళితవాడ కాలనీలలో ఉన్న 26/3/1తో ప్రారంభమై-26/3/214, -26/4/1-26/4/316లతో ముగుస్తుంది. మొత్తం ఓటర్లు 1473.



మున్సిపల్ కార్యాలయం

12వ వార్డులో గడ్డవీధి, సొసైటి కాలనీ, రామకృష్ణ కాలనీలోని డోర్ నంబర్ 26/1/1తో ప్రారంభమై-26/1/565తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1722. 13వ వార్డులో సొసైటి కాలనీ, గడ్డవీధి, నేతాజీనగర్, అంబికానగర్‌లలో ఉన్న డోర్‌నంబర్ -26/2/1-26/1/750తో ప్రారంభమై 26/2/1 -26/2/149 2/5/1-26/5/285తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1625. 14వ వార్డులో పార్కు వీధి, టీపీఆర్ థియేటర్‌లైన్, బాలాజీ నగర్ బీరువాల లైన్‌లలో ఉన్న డోర్ నంబర్ 1/601-1/1300 ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1331. 15వ వార్డులో తాతయ్యగుడి వీధి, బృందావన్ కాలనీ, ప్రొద్దుటూరు రోడ్డు, 7వ వార్డు స్కూల్, పిండిమిషన్ వీధి, టీకేఆర్ స్కూల్ వీధి లలో ఉన్న డోర్ నంబర్ 1/291-1/600తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1668. 16వ వార్డులో వాటర్ ట్యాంక్ వీధి, వినాయకనగర్, బ్యాంక్ కాలనీ, రోజాటవర్స్, ఆర్డీఓ ఆఫీసు లైన్‌లో ఉన్న డోర్ నంబర్ 2/01 -2/606తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1549. 17వ వార్డు గంగమ్మ ఆలయం, బెల్లాల వీధి, ఎస్పీజీ క్వార్టర్స్, ఎక్సైజ్ ఆఫీసు వీధి, రేడియన్స్ స్కూల్‌లలో ఉన్న డోర్ నంబర్ 3/01-3/127, అలాగే 4/1-4/276తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1365. 18వ వార్డులో నెహ్రూనగర్, దిగువపట్నం, పాంపల్లె వీధి, సీఎస్‌ఐ వీధిలలో ఉన్న డోర్ నంబర్ తో ప్రారంభమై 4/277-4/853తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1395. 19 వ వార్డులో దిగువపట్నం, నెహ్రూనగర్, పీకే రామయ్యవీధి, బురుజు వీధిలలో ఉన్న డోర్ నంబర్‌తో ప్రారంభమై 4/854-4/1032, 5/1-5/162లతో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1352. 20వ వార్డులో కోటా వీధి, పోస్టాఫీసు వీధి, ఈడిగపేట, లక్షుమ్మచేను, యేటివారాలలో ఉన్న డోర్ నంబర్‌తో ప్రారంభమై 6/1-6/132,-7/1-7/119,8/1-8/402లతో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1654. 21వ వార్డులో కుండావారి వీధి, తలారి వీధి, పురేటి వీధి, బేపారి వీధి, మిఠాయిగిరి వీధి, చాకలి వీధిలలో డోర్ నంబర్‌తో ప్రారంభమై 9/1-9/259, 10/1-10/175 తో ముగుస్తుంది. మొత్తం ఓటర్లు 1488. 22వ వార్డులో మెయిన్ బజార్, మర్వాడీ వీధి, ముచ్చర్ల వీధి, ఆంజనేయస్వామి ఆలయం, మంగళివీధి, కుమ్మరవీధిలలోని డోర్‌నంబర్ 11/1-11/138, వరకు అలాగే 12/1-12/161, 13/1 -13/202లతో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1456. 23వ వార్డులో కన్యకాపరమేశ్వరి ఆలయం వీధి, చెన్నబసవప్ప వీధి, మార్కెట్ వీధిలో డోర్ నంబర్ 14/1-14/117, అలాగే 15/1-15/126, 16/1 -16/141, 17/01-17/204తో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1484. 24వ వార్డులో తాడిపత్రి రోడ్డు, చల్లపల్లి స్కూల్‌వీధి, బీఆర్ వీధి, కాపువీధి, పలగాడీ వీధి డోర్ నంబర్ 18/1-18/365 మొదలు 19/01-19/299లతో ముగుస్తుంది, మొత్తం ఓటర్లు 1651. 25వ వార్డులో టెక్కాయచేనువీధి (19/300-19/802), మొత్తం ఓటర్లు 1494.